# వేములవాడను దత్తత తీసుకుంటా

- సిరిసిల్లను అభివృద్ధి చేసినట్లే చేస్తా
- సూరమ్మ చెరువును రెండేండ్లలో పూర్తి చేస్తా
- మన్నెగూడెంను మండలంగా మార్చుతాం
- భీమారానికి జూనియర్ కళాశాల మంజూరు
- చల్మెడను భారీ మెజార్టీతో గెలిపించండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మంత్రి కేటీఆర్

వేములవాడ/ కథలాపూర్/ రుద్రంగి/ చందుర్తి/ కోనరావుపేట, నవంబర్ 15: 'చల్మెడ లక్ష్మీనర్సింహారావు సౌమ్యుడు, పట్టుదల కలిగిన మంచివ్యక్తి. ఆయనను వేములవాడ బీఆర్ఎస్ అభ్యర్థిగా కేసీఆర్ ఎంపిక చేశారు. చల్మెడను భారీ మెజార్టీతో గెలిపిస్తే వేములవాడ నియోజకవర్గాన్ని దత్తత తీసుకొంటా. సిరిసిల్ల నియోజకవర్గంలా అభివృద్ధి చేస్తా' అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, ఐటీ, మున్సిపల్ శాఖ మంత్రి కేటీ రామారావు ప్రకటించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో సంక్రాంతి పగటి వేషగాళ్లలా, గంగిరెద్దుల వారిలా బీజేపీ, కాంగ్రెస్ పార్టీల నాయకులు ప్రజల వద్దకు ఓట్ల కోసం వస్తున్నారని, కాకిరిబీకిరి మాటలతో మరోసారి మభ్యపెట్టేందుకు చూస్తున్నారని, ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నిర్ణయాత్మకమైన, కీలకమైన ఎన్నికల్లో ప్రజలు ఆలోచించి, మేలు చేసే బీఆర్ఎస్, కేసీఆర్ ప్రభుత్వానికి మద్దతు పలకాలన్నారు. కథలాపూర్, చందుర్తి మండల కేంద్రాల్లో బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభలకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అలాగే రుద్రంగి, కోనరావుపేట, వేములవాడలో రోడ్‌షోల్లో పాల్గొన్నారు. ఆయాచోట్ల మాట్లాడారు. ఈ ఎన్నికలు అత్యంత కీలకమైనవని, తెలంగాణ తలరాతను మార్చుకునేవని, ప్రజలు జాగురుకతతో నిర్ణయం తీసుకోవాలని సూచించారు. ఆడపిల్ల పెండ్లి విషయంలో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు ఎంత క్షుణ్ణంగా ఆలోచించి, ప్రయోజకుడు అయిన వ్యక్తికి ఇవ్వాలని అనుకుంటామో..? ఎన్నికల సమయంలో అలాగే ఆలోచించి, సరైన వారికి అధికారం ఇవ్వాలన్నారు. తెలంగాణ ఏర్పడిన తొమ్మిదిన్నరేండ్లు పూర్తయినా, వాస్తవికంగా పరిపాలన సాగింది ఆరున్నరేండ్లేనని అన్నారు. రెండేండ్లు కరోనా సావగొట్టిందని, మూతికి బట్ట కట్టుకొని అందరం భయంభయంగా బతికామన్నారు. మరో ఏడాది పార్లమెంట్, మున్సిపల్, పంచాయతీ ఎన్నికలకు పోయిందన్నారు. ఆరున్నరేండ్లలో అనేక విజయాలను సీఎం కేసీఆర్ సాధించారన్నారు. ఉచిత విద్యుత్, రైతుబంధు, రైతు బీమా, 46 లక్షల మందికి పెన్షన్లు, నాలుగన్నర లక్షల మందికి బీడీ పెన్షన్లు అందజేస్తున్నామన్నారు. గోదావరి నీటిని వేములవాడకు మళ్లించుకోగలిగామన్నారు. 2014కు ముందు ఎట్లున్న వేములవాడను, ఎట్లా మార్చుకున్నామో అందరూ గమనించాలని సూచించారు. కాంగ్రెస్ దరిద్రానికి నేస్తమని, పదొకొండు సార్లు అవకాశం ఇస్తే రాష్ట్రాన్ని దరిద్రంగా మార్చివేసిందన్నారు. కరెంట్ కోతలు, సాగు, తాగునీటి కష్టాలతో అల్లాడిన రోజులను అందరూ గుర్తుకు తెచ్చుకోవాలన్నారు. అర్ధరాత్రి ఇచ్చిన కరెంట్ వల్ల కరెంట్ షాక్‌లు తగిలి, పాములు, తేళ్లు కుట్టి చాలా మంది చనిపోయారని విచారం వ్యక్తం చేశారు. విత్తనాలు సరిగా లేక, ఎరువులు రాక రైతులు పడిన బాధలు అందరికీ తెలిసినవేనన్నారు. ఇలాంటి రాష్ట్రాన్ని సీఎం కేసీఆర్ ఎలా మార్చివేశారో..? అందరూ అర్థం చేసుకోవాలని సూచించారు. నేడు అందరికీ రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత విద్యుత్ అందిస్తున్నామన్నారు. ఇంత గొప్పగా పరిపాలన సాగుతున్న సమయంలో ఎన్నికలు వచ్చాయని, అధికారం కోసం కాంగ్రెస్, బీజేపీలు మళ్లీ దొంగవేషాలతో, తియ్యటి, పుల్లటి మాటలతో ప్రజల వద్దకు వస్తున్నారన్నారు. ఇలాంటి వారిని ప్రశ్నించాలన్నారు. ఇది వ్యక్తుల మధ్య జరుగుతున్న ఎన్నిక కాదని పార్టీలు, అభివృద్ధి చేసిన బీఆర్ఎస్‌కు మధ్య జరుగుతున్న ఎన్నిక మాత్రమేనని ప్రజలు గుర్తించాలన్నారు. మావురోడు, మా కులపోడు అనే సెంటిమెంట్లకు పడిపోవదన్నారు. 'సుట్టం అయితే ఒక రోజు ఉండి తినిపోమ్మనండి గానీ ఓటు వేయకండి' అని ప్రజలకు పిలుపునిచ్చారు. కులం, మతం పేరుతో వచ్చేవారిని నమ్మవద్దన్నారు.

**మన్నెగూడెం మండలం.. బీమారానికి కాలేజీ**

కథలాపూర్ మండలంలోని సూరమ్మ చెరువు రిజర్వాయర్ గతంలోనే పూర్తి కావాల్సిందని, అయితే కరోనా వల్ల పూర్తి కాలేదన్నారు. కరోనా వల్ల రాష్ట్రానికి లక్షన్నర కోట్ల నష్టం వచ్చిందని, దీంతో సూరమ్మ చెరువు రిజర్వాయర్‌ను పూర్తి చేయలేకపోయామని చెప్పారు. మూడోసారి అధికారంలోకి రాగానే సూరమ్మ రిజర్వాయర్ పనులు చేపడుతామని, రెండేండ్లలో దాన్ని పూర్తి చేస్తామన్నారు. అలాగే మన్నెగూడెంను మండలం చేయాలన్న డిమాండ్ ఉందని, తప్పకుండా మండలంగా మార్చివేస్తామన్నారు. భీమారం మండలంలో జూనియర్ కాలేజీ ఏర్పాటు చేయాలన్న డిమాండ్ ఉందని, దాన్ని పూర్తి చేస్తామన్నారు. మేడిపల్లి, కథలాపూర్, బీమారం మండలాల్లో కొన్ని అంతర్గత రోడ్లను పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారని, వాటన్నింటినీ పూర్తి చేస్తామన్నారు. అలాగే 2014 కటాఫ్ డేట్‌ను ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు, రాష్ట్ర వ్యాప్తంగా కొందరు బీడీ కార్మికులకు పెన్షన్ అందడం లేదని, అధికారంలోకి రాగానే మిగిలిపోయిన బీడీ కార్మికులందరికీ పెన్షన్ మంజూరు చేస్తామన్నారు. అలాగే కొత్త రేషన్‌కార్డులు, కొత్త పెన్షన్లు మంజూరు చేస్తామన్నారు. లక్షల సంఖ్యలో పెన్షన్లు ఇస్తున్నామని, మరో రెండు లక్షల మందికి పెన్షన్ ఇవ్వడం పెద్ద సమస్య కాదన్నారు. కాంగ్రెస్‌వాళ్ల లాగ తాము లంగలం కాదని, ఇచ్చిన మాట ప్రకారం అన్నీ ఇస్తామన్నారు.

**బీజేపీలో మహిళలకు గౌరవం లేదు**

బీజేపీలో మహిళలకు గౌరవం లేదని మంత్రి ధ్వజమెత్తారు. ఉద్యమకారిని, కరీంనగర్ ఉమ్మడి జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమక్కకు టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి, తర్వాత బీఫాం ఇవ్వకుండా మోసం చేసిందని, తీవ్రంగా అవమానించిందని మండిపడ్డారు. ఉద్యమకారిని అయిన తుల ఉమక్కకు బీఆర్ఎస్ ఎప్పుడూ సముచిత స్థానం ఇచ్చిందని, ఇంటి ఆడబిడ్డలా చూసుకున్నదని, ఇంటి ఆడబిడ్డ కంట నీరు చూసి సీఎం కేసీఆర్‌తో పాటు అందరం వేదనకు గురయ్యామన్నారు. అక్కకు జరిగిన అవమానం చూసి చలించి, సొంత ఇంటికి తిరిగి రావాలని ఆహ్వానించామని, ఉమ అక్కకు బీఆర్ఎస్ ఎప్పుడూ తల్లిగారి ఇల్లే అని చెప్పారు. అక్కకు మరింత మంచి పదవి వస్తుందని, దానికి తనదే పూచి అన్నారు. అక్కను ఏడిపించి, మహిళ జాతిని అవమానించిన బీజేపీకి డిపాజిట్ రాకుండా బుద్ధి చెప్పాలని కేటీఆర్ పిలుపునిచ్చారు.

**కాంగ్రెస్‌కు ఓటు వేస్తే నిత్య జాగారమే**

వేములవాడ రాజన్న దగ్గర కోడెమ్మకు మొక్కు చెల్లించుకుని ఏడాదికి ఒక్కరోజు శివరాత్రికి మాత్రమే జాగారం ఉంటామన్నారు. కానీ, కాంగ్రెస్‌కు ఓటేస్తే ప్రతి రాత్రీ మనకు జాగారమే అవుతుందనే విషయాన్ని గుర్తించాలన్నారు. కాలిన కరెంటు మోటర్లు, పేలిన ట్రాన్స్‌ఫార్మర్లు, ఎండిన రైతు పొలాలు, అలాంటి దుఃఖం బతుకులు మనకు వద్దని సూచించారు. నాడు ఎండాకాలం వచ్చిందంటే నీళ్ల బాధతో గ్రామాలకు ప్రజాప్రతినిధులు వెళ్లలేని పరిస్థితి నుంచి నేడు ప్రతి ఇంటికి తాగునీరు అందించిన ఘనత సీఎం కేసీఆర్ కాదా..? ఒకసారి ఆలోచించాలని సూచించారు. పంటకు 10 హెచ్‌పీ మోటర్ పెట్టి నీళ్లు అందించాలని కరెంట్‌పై కనీస అవగాహన లేని రేవంత్ రెడ్డి మాట్లాడుతున్న తీరు వాళ్లకు రైతుల మీద ప్రేమ ఎంతవరకు ఉందో అర్థం చేసుకోవాలన్నారు. ఎవరు ఎప్పుడు జైలుకు వెళ్తాడో తెలియదు కానీ, అలాంటి వాళ్ల మాటలు నమ్మి మనం మోసపోకూడదని సూచించారు. కాంగ్రెస్ పాలనలో ₹200 ఉన్న పింఛన్‌ను సీఎం కేసీఆర్ ₹2వేలకు పెంచడమే కాకుండా వచ్చే రోజుల్లో రూ.5వేల వరకు చేస్తామని హామీ ఇచ్చారు. 18 ఏండ్లు నిండిన యువతులకు సౌభాగ్య లక్ష్మి పథకం కింద నెలకు రూ.3వేలు అందిస్తామన్నారు. రైతుబంధు సాయాన్ని ₹16 వేలకు పెంచబోతున్నట్లు చెప్పారు. ప్రతి తెల్ల రేషన్ కార్డు నా కుటుంబానికి కేసీఆర్ బీమా పథకం అమలు చేస్తూ ఏదైనా ప్రమాదం జరిగితే ₹5 లక్షల బీమా అందేలా చూస్తామని చెప్పారు. ఉన్న ఒక్క తెలంగాణ గొంతు కేసీఆర్ మీదికి ఢిల్లీ నుంచి కాంగ్రెస్, బీజేపీలు కర్ణాటకను కలుపుకొని దండుగా వస్తున్నాయని, మనం అప్రమత్తంగా ఉండి కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిగా చేసేందుకు ప్రతి ఒక్కరూ కారు గుర్తుపై ఓటు వేసి చల్మెడ లక్ష్మీనర్సింహారావును గెలిపించాలని కోరారు.

**ఈ ప్రాంతం నుంచి వలసలు తగ్గాయి**

సాగునీరు విద్యుత్ కావలసినంత అందుతున్న నేపథ్యంలో ఈ ప్రాంతం నుంచి వలసలు పూర్తిగా తగ్గాయని మంత్రి కేటీఆర్ అన్నారు. మల్కపేట రిజర్వాయర్ నిర్మాణం చేపట్టడమే కాకుండా పనులు కూడా పూర్తయ్యాయని, ఇక్కడి నుంచి రూ.166 కోట్లతో నిమ్మపల్లి చెరువుకి ఎత్తిపోతల పథకం కూడా పూర్తవుతుందని చెప్పారు. ఒకప్పుడు తాగు, సాగునీటికి ఇబ్బంది పడిన కోనరావుపేట మండలం ఇపుడు సస్యశ్యామలంగా మారిందని, ఇది ముఖ్యమంత్రి కేసీఆర్ చేసిన మార్పు కాదా..? ఆలోచించాలని సూచించారు. ఈ ప్రాంతానికి మొదటగా చందుర్తికి గోదావరి జలాలు తీసుకురావడమే కాకుండా 50వేల ఎకరాలకు సాగునీరు కేసీఆర్ ప్రభుత్వమే ఇచ్చిందని వివరించారు.

**రాజన్న ఆలయ అభివృద్ధి నా బాధ్యత**

వేములవాడ రాజన్న ఆలయ అభివృద్ధి నా బాధ్యత అని మంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు. రాజన్న ఆలయం ఎదుట రోడ్‌షోలో మాట్లాడారు. కేసీఆర్ సీఎం కాకముందు వేములవాడలో కరెంట్ ఎట్లా ఉండే ఒకసారి ఆలోచన చేయాలని ప్రజలను అడిగారు. అవసరాలకు నాయకులను బతిమిలాడి కరెంటు వేసుకొని రోజులుపోయి.. 24గంటల విద్యుత్ అందిస్తున్నామని చెప్పారు. రాష్ట్రం రాకముందు వేములవాడ ఎట్లుంది? ఇప్పుడు ఎలా ఉందో ఆలోచించాలని కోరారు. వేములవాడలోనే వంద పడకల దవాఖాన పెట్టి నిరుపేదలకు వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. గోదావరి జలాలను రాజన్న చెంతకు చేర్చామని, గుడి చెరువును నింపామన్నారు. సిలిండర్ ధరల పెరిగితే నీతో అయితలేదని మన్మోహన్‌సింగ్‌ను విమర్శించిన ప్రధాని, ఇప్పుడు అదే సిలిండర్ రూ.1200 చేశాడని దుయ్యబట్టారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ అయిన తర్వాత రూ.400కే ఇస్తామని చెప్పారు.

## చల్మెడను దీవించండి

**- రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్ కుమార్**

కాంగ్రెస్ పూటకో మాట మాట్లాడుతున్నదని, అలాంటి మోసపూరిత పార్టీని నమ్మద్దని వేములవాడ నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి, రాష్ట్ర ప్రణాళికా సంఘం ఉపాధ్యక్షుడు బీ వినోద్ కుమార్ ప్రజలకు సూచించారు. చందుర్తిలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడు గంటల కరెంట్ చాలని అన్నాడని, ఆ కరెంట్ సరిపోతదా ఆలోచించాలని సూచించారు. ఇంకా కరెంట్‌పై కనీస అవగాహన లేకుండా 10హెచ్‌పీ మోటరు పెడితే నీరు పారించుకోవచ్చని మాట్లాడుతున్నాడన్నారు. మన దగ్గర అంత పెద్ద మోటర్లు వాడే రైతులు ఎవరూ ఉండరని, మోటర్ కావాలంటే రేవంత్ కొనిస్తడా..? చెప్పాలన్నారు. అభివృద్ధి,సంక్షేమం రెండు కండ్లుగా బీఆర్ఎస్ పాలన కొనసాగిస్తున్నదని, ఇంకా చేయాల్సింది ఎంతో ఉందన్నారు. నేనొక్కటే అడుగుతున్నా.. ప్రజలు సంక్షేమం కోరే బీఆర్ఎస్ వైపు ఉంటారా..? మోసపూరిత కాంగ్రెస్ వైపు ఉంటారా..? ఆలోచించుకోవాలని పిలుపునిచ్చారు. వేములవాడ అభ్యర్థి చల్మెడ లక్ష్మీనర్సింహారావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

## కేసీఆర్‌ను గెలిపించాలి.. బీజేపీకి బుద్ధి చెప్పాలి:

**- కరీంనగర్ జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ**

బీజేపీ నమ్మించి మోసం చేసి, అవమానిస్తే బీఆర్ఎస్ పార్టీ, సీఎం కేసీఆర్, మంత్రి కేటీఆర్ ఆడబిడ్డను పుట్టింటికి ఆహ్వానించినట్లు ఆహ్వానించారని బీఆర్ఎస్ రాష్ట్ర నాయకురాలు, జడ్పీ మాజీ చైర్‌పర్సన్ తుల ఉమ పేర్కొన్నారు. బీఆర్ఎస్‌లోకి తిరిగి వచ్చిన తర్వాత తొలిసారిగా కథలాపూర్‌లో జరిగిన ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొని, మాట్లాడారు. బీజేపీ బీసీలకు పెద్దపీట వేస్తామని, మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామన్న మాట బూటకమన్నారు. తనకు టికెట్ ఇచ్చినట్టే ఇచ్చి, బీఫాం ఇవ్వకుండా మోసం చేయడం తీవ్రంగా కలిచివేసిందన్నారు. ఉద్యమ సమయంలోనూ తాను ఏనాడూ కన్నీళ్లు పెట్టుకోలేదని, బీజేపీ చేసిన నమ్మకద్రోహానికి కన్నీళ్లు ఆగలేదన్నారు. కన్నీరు, వేదనను చూసి 'అక్క నీ పుట్టింటికి నువ్వు తిరిగి రా, నిన్ను కడుపులో పెట్టి కాపాడుకుంటాం' అని కేటీఆర్ అన్న ఇచ్చిన మద్దతును జీవితాంతం మర్చిపోనన్నారు. ఉద్యమకాలం నాటి సహచరులు అయిన వినోద్‌కుమార్‌తో పాటు అందరూ ఆహ్వానించారన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తూ, మహిళలు, బీసీలను అణగదొక్కుతున్న ఆ పార్టీకి ప్రజలు బుద్ధిచెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో అభివృద్ధి ప్రదాత అయిన కేసీఆర్‌ను బలపరిచి, బీఆర్ఎస్‌ను అధికారంలోకి మరోసారి తేవాలని సూచించారు.

## అభివృద్ధే నా ఆశయం

**- వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు**

వేములవాడ నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తానని, ఆశతో కాకుండా, అభివృద్ధి చేయాలనే ఆశయంతో వస్తున్నానని వేములవాడ ఎమ్మెల్యే అభ్యర్థి చల్మెడ లక్ష్మీనరసింహారావు పేర్కొన్నారు. ఈ ఎన్నికల్లో అభివృద్ధి నిరోధక కాంగ్రెస్, బీజేపీలకు బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. రాష్ట్రంలో ఇప్పుడిప్పుడే అభివృద్ధి ఛాయలు కనిపిస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో 60 ఏండ్లు కష్టాలు అనుభవించామని, ఇప్పుడు మళ్లీ అలాంటి కష్టాలను తెచ్చుకోవద్దన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండి, బీజేపీ, కాంగ్రెస్‌లకు బుద్ధిచెప్పాలన్నారు. రానున్న ఎన్నికల్లో సీఎం కేసీఆర్‌ను బలపర్చి, బీఆర్ఎస్‌కు మద్దతునివ్వాలన్నారు. వేములవాడ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేయాలన్న సంకల్పంతో వచ్చిన తనకు మద్దతు తెలపాలన్నారు. కథలాపూర్ సూరమ్మ చెరువు రిజర్వాయర్‌తో పాటు, మన్నెగూడెం మండలం, భీమారం జూనియర్ కాలేజీ, ఇంటర్నరల్ రోడ్లను మంజూరు చేయించే బాధ్యతను తీసుకుంటానన్నారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

WANTED

jobs Apply Now!

★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

CHANGE OF NAME

★ I, MOHAMMED AZEEZ, R/o. 4-1-553/1, Balaji Road, Korutla, Jagityal, Telangana. I have Changed My Name as MOHAMMED NASAR, S/o. Mohammed Rahimuddin.
NT-313001

★ I, CHELLOJI SATHAIAH, R/o. 4-67/2, Shalapally, Lingapur, Pegadapalli, Jagityal, Telangana. Changed My Name as CHELLOJI SATHYAM, S/o. Chelloji Janardhan.
NT-313001

★ I, THOTLA VINEELA, W/o. Rohith Kumar, R/o. 1-1-16/1, Jagithyal Road, Vemulawada, Rajanna Sircilla, T.S., have Changed My Name as THOTLA RAJITHA, W/o. Rohith Kumar.
NT-313002

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 91827 77571
91827 77194